# అతిథిస్సర్వత్రవర్జయేత్

## యమ్. సుగుణరావు

గణపతి బస్సు దిగి చుట్టూ చూసాడు. వలయాకారంలో చుట్టుముట్టిన రిక్షా వాలాలు.

''రండి సార్ రండి'' అంటూ ఆప్యాయంగా పిలవడం ప్రారంభించారు తామున్న చోటినుండి కదలకుండా.

బలంగా, ఎత్తుగా వున్న రిక్షావాలా వైపు చూసేసరికి ''ఏంటి బాబూ! ఏదైనా లాడ్జికి తీసుకెళ్లాలంటారా?'' అన్నాడు ఆ రిక్షావాలా.

ధర్మరాజంతటి బాబాయ్ ఈ ఊళ్ళో ఉండగా వసతి గృహాల జోలి మనకేల! అనుకుంటూ ''డిప్పకాయలపాడుకి ఎంతివ్వమంటావ్?'' అన్నాడు గణపతి.

''ఒక శాల్తీకి మూడు, ఇద్దరైతే ఐదు'' అన్నాడు గణపతి ఆకారం చూసి.

ఐదు నిముషాల చర్చల అనంతరం రూపాయి డిస్కౌంట్‌తో విజయగర్వంతో రిక్షా ఎక్కాడు గణపతి.

''బాబాయ్ బస్టాండుకు రాలేదేమిటి చెప్మా? ఏమైందో? రెండ్రోజుల క్రితం టెలిగ్రామ్ కూడా ఇచ్చాను'' అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు.

గణపతికి లాటరీలో లక్ష దొరికినంత ఆనందంగా వుంది. తను పురావస్తు శాఖలో ఉద్యోగి. ఆ ఊళ్ళో ఎవరో ఇంటికోసం పునాదులు తవ్వుతుంటే కొన్ని శిలా విగ్రహాలు బయటపడ్డాయి. వాటి విషయం గురించి పరిశోధించి ఆ తర్వాత ఒక నివేదిక తయారు చేయాలి. అలా శిలా విగ్రహాలు వివరాలు గురించి భోగట్టా చెయ్యమని అత్యవసరంగా పంపారు. ఒక నెల రోజులపాటు ఆ ఊళ్ళో వుండి అవసరమైన సమాచారం సేకరించే పనిమీద వచ్చాడు. ప్రభుత్వం వారిచ్చే దినసరి భత్యం, రోజువారీ ఖర్చులు లాడ్జివారికి అంకితం చేయకుండా తెలిసిన వాళ్లింట్లో తిష్టవేసి ఆ డబ్బంతా మిగుల్చుకోవాలనే దు(దూ)రాశతో బాబాయ్‌గారి మీద వాలిపోదామని వచ్చాడు.

''అయ్యా! డిప్పకాయలపాడు ఇదే. మీరు ఎవరింటికెళ్లాలి?'' అన్న రిక్షావాలా మాటలతో ఈ లోకంలోకి వచ్చి చుట్టుపక్కల చూసాడు. సైకిల్‌మీద వెళుతున్న పోస్ట్‌మేన్ కనిపించేసరికి...''అయ్యా! పానకాలరావు గారిల్లెక్కడ?'' అన్నాడు.

పోస్టుమాన్ ఆ మాటలకు నవ్వి ''ఆయనది ఇల్లెక్కే ఉద్యోగం కాదండీ. ఇల్లు పీకే ఉద్యోగం. అదే మున్సిపాలిటీలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్. నేనిప్పుడు ఆయనింటికే పోతున్నాను. బాబ్బాబూ ఈ టెలిగ్రామ్ ఆయనకిచ్చెయ్యరూ. ఆ సందు చివర రంగు వెలసిన డాబా ఇల్లు...'' గబగబా చెప్పి టెలిగ్రామ్ గణపతి చేతిలో ఉంచి బలవంతంగా సంతకం చేయించుకుని వేగంగా కదిలాడు పోస్ట్‌మాన్. గణపతి టెలిగ్రామ్ విప్పి చూసాడు.

''కమింగ్ సెవెంత్ మార్నింగ్ బై బస్-పతి.''

ఎవడీ పతి? బాబాయ్‌కీ వీడికీ ఏమిటి సంబంధం? నాకింకోడు పోటీయా?'' అని మదనపడసాగాడు గణపతి.

అంతలో ఫ్లాష్‌లా వెలిగింది బల్బు.

'అమ్మయ్య నేనేకదా పతిగాణ్ణి. నేనిచ్చిన టెలిగ్రామ్ నాకే చేరింది. విజ్ఞానం చాలా అభివృద్ధి చెందింది' అనుకుంటూ రిక్షాలోంచి క్రిందకి దిగాడు బెడ్డింగు, సూట్‌కేసు తీసుకుని.

పోస్టుమాన్ చెప్పిన ప్రకారం తన బాబాయ్ పానకాలరావు ఇల్లు గుర్తుపట్టి ఆ ఇంటి తలుపు తట్టాడు. బైటికొచ్చిన పానకాలరావు, పతిని చూసి ప్రశ్నార్థకంగా నిలబడ్డాడు.

''నేను బాబాయ్ పతిని. మీ ఇంటికి అసలు రావడంలేదని తెగ బాధపడిపోతున్నారని తెలిసి వచ్చేసాను. సరదాగా నెలరోజులుండిపోతాను'' అన్నాడు.

పానకాలరావు చూపుల్లో మార్పులేదు. గణపతిని, అతని చేతిలోని భారీ సూట్‌కేసు, బెడ్డింగులను మార్చి మార్చి చూసి-

''మా గణపతి ఒంటి పేగులా వుండేవాడు. మరేమిటి నువ్వు ఇలా?'' అన్నాడాయన అనుమానంగా.

అందుకు సమాధానంగా గణపతి నవ్వి ''ఆ ఒంటి పేగు జంట పేగు అయ్యాడు. పెళ్ళయింది బాబాయ్. అంచేత కాసింత ఒళ్ళు చేసాను'' అంటూ సిగ్గుపడ్డాడు.

ఆ మాటలకు ఆయన గట్టిగా ''ఏమేవ్. అండాళ్ళూ నా వేలు విడిచిన మేనమామగారి మూడో అల్లుడి వియ్యంకుడికి దూరబంధువు వీడే. పీనుగులా వుండే వాడు ఏనుగులా అయ్యాడు'' అంటూ లోపలికి వెళ్ళి పోయాడు అతడిని ఆహ్వానించకుండానే.

స్వాగత సత్కారాలు లేకపోగా తిరస్కారంగా ఆయన చూడడం, నోటికి అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడడం, ఇంటికివచ్చిన అతిథి మీద జోకులేయడం గణపతికి ఇబ్బంది కలిగించింది. పైగా పానకాలరావు 'డు..ము..వు..ల' ప్రయోగం కర్ణకఠోరంగా వుంది.

పానకాలరావు వెళ్లిన ఐదు నిముషాలకు అతడి భార్య అండాళమ్మ బైటికొచ్చింది.

''ఔను సుమా! వీడు పేరుకు తగ్గట్టే అయ్యాడు. ఏరా పతీ! నీ పెళ్లాన్ని కూడా తీసుకు రాలేకపోయావా. ఒక్కడివే తగలడ్డావేం'' అంది.

పతి భరించలేకపోయాడు. ఆవిడ కూడా 'డు.ము.వుల' భాషలోనే మాట్లాడడంతో.

తప్పదు. దినసరి భత్యాలు, రోజువారీ ఖర్చులు మిగలాలంటే ఇలాంటి బుల్లి బుల్లి కష్టాలు తప్పవు అనుకుంటూ వారు లోపలకు పిలవకుండానే తనే ప్రవేశించి తన పనులు చేసుకోవడం ప్రారంభించాడు.

ముందస్తుగా దంతధావనం పూర్తిచేసి ఆ తదుపరి కార్యక్రమానికి కాఫీ త్రాగడం తప్పనిసరి కనుక వంట గది వైపు ఒక చూపు సారించి పేపరులో తల దూర్చాడు.

పావుగంట తరువాత బాబాయ్ చిన్నకొడుకు ఒక పింగాణీ జగ్గుతో వచ్చి గణపతికి అందించాడు. అది కాఫీ అని ఆత్రంగా అందుకోబోయిన గణపతి అది వేడిగా వున్న ఒక జిగురు పదార్థంగా గుర్తించాడు.

గణపతి ముఖంలో మారే రంగుల్ని గమనించి ''మా ఇంట్లో కాఫీ నిషిద్ధం. సంపూర్ణ ఆరోగ్యానికి ఈ రాగి అంబలే శరణ్యం. ఐయామ్ ఏన్ అంబలి బోయ్'' అంటూ భుజాలు ష్రగ్ చేసి వెళ్లిపోయాడు ఆ కుర్రాడు.

'టీవీలో వాణిజ్య ప్రకటనల ప్రభావం కాబోలు' అనుకుంటూ ఆ పదార్థాన్ని రుచి చూసే సాహసం చెయ్యలేక కాఫీ తాగడానికి బయటకు నడిచాడు గణపతి.


ఆ విధంగా చుట్టాలింట్లో ఆ మొదటిరోజు ఉదయం బాధాకరంగా ముగిసింది గణపతికి.

• • •

మధ్యాహ్నం తను సర్వే చేయవలసిన పనుల నిమిత్తం ఊళ్లోకి బయలుదేరి భోజనం బైటే కానిచ్చి

ఇంటికొచ్చేసరికి బాబాయ్ పెద్దకూతురు తన ఇద్దరు పిల్లలతో వచ్చింది. బాబాయ్ కూతురుకీ, అల్లుడికీ అదే ఊళ్ళో ఉద్యోగం. మధ్యాహ్నం పిల్లల్ని స్కూలు నుంచి ఇంటికి తీసుకొచ్చి ఆమె వదిలి వెళుతుంది. సాయంత్రం భార్యాభర్తలిద్దరూ ఆఫీసయిన తరువాత పిల్లల్ని తీసుకుని వెళ్లిపోతారు. ఇది రోజూ జరిగే తంతే!

ఆ మధ్యాహ్నం తన బెడ్డింగ్ పరచి నిద్రకు ఉపక్రమించబోయిన గణపతికి నిద్ర కరువయింది. ఆ పిల్ల రాక్షసుల్లో ఒకడికి నాలుగేళ్ళు, ఇంకొకడికి ఐదేళ్ళు.



వాళ్ళు ఏదిబడితే అది విసురుతారు. అతి లాఘవంగా వాటి నుండి తప్పించుకుని వారిని వినోదపరచాలి. లేకపోతే ఆరున్నొక రాగం ఆలపిస్తారు. బాబాయ్ కుటుంబం అంతా నిద్రపోయి ఆ పిల్లల్ని గణపతికి వదిలేసారు. ఆ సాయంత్రం వరకూ కంటిమీద కునుకులేదు గణపతికి.

రాత్రి కాగానే మరో సమస్య ఎదురయింది. ఆ ఇంట్లో అన్నీ బెడ్ బల్బులే పిల్లలు చదువుకునే గదులలో తప్ప. కారణం ఆ ఏరియాలో లోవోల్టేజీ డ్రాప్ అట. బల్బులు తరచుగా మాడిపోవడంతో గత్యంతరం లేక ఆ జీరో బల్బునే వాడుతున్నారట.

అసలే చత్వారం. పైగా డిమ్‌లైట్లు. గణపతికి రెండు మూడుసార్లు ఆ వాతావరణం మాయాబజారులా కనిపించింది. ఒక మోస్తరు దెబ్బలు, చిన్న గాయాలతో బయటపడ్డాడు సురక్షితంగా.

పైగా రాత్రిపూట అతడి గదిలోని సీలింగ్ ఫేన్ చాలా స్పీడుగా తిరుగుతుంది. రిమోట్‌లేని ఆ ఫేన్ ఆపేస్తే దోమలూ అంత వేగంతో ప్రవేశిస్తున్నాయి. ఫేను వేస్తే తుమ్ములు, ఆపేస్తే దోమలు. 'పరమాత్మా...ఏమిటీ నీ లీలలు' అని పాడుకుంటూ జాగరణం చేసాడు గణపతి ఆ రాత్రంతా.

• • •

తరువాతి రోజు ఉదయం సామాను సర్దుకుని లాడ్జిలో వుండడానికి బయలుదేరుతున్న గణపతిని చూసి–

''ఏరా అబ్బాయ్! నెలరోజులుంటానన్నావుకదా. అప్పుడే వెళ్లిపోతున్నావే?'' అన్నాడు బాబాయ్ పానకాలరావు.

''అబ్బే మీకెందుకు శ్రమ? లాడ్జిలో వుంటా'' అంటూ బ్రతుకుజీవుడా అని బయటకు నడిచాడు గణపతి.

వెళ్లిపోతున్న గణపతిని చూసి 'వీడొచ్చే ముందురోజు వరకూ చుట్టాలతో సతమతమయ్యాము. ఈ నగరంలో ఇంటికొచ్చే అతిధులతో అప్పులపాలై 'అతిధి సర్వత్ర వర్జయేత్' అనుకోవాల్సి వస్తోంది. నెలరోజులు తిష్ట వేస్తాడని పసిగట్టి మొత్తం అందరం ఓవర్ యాక్షన్ చేసాం. బ్రతికేంరా బాబూ'...అనుకుని ''ఏమేవ్ అండాళ్ళూ! కాఫీ పట్రా'' అంటూ అరిచాడు పానకాలరావు.

• • •

గణపతి, బాబాయ్‌గారి ఇంటి నుంచి బయటపడి నెలరోజులు లాడ్జిలో గడిపి తిరిగి గృహోన్ముఖుడయ్యాడు. ఆ ఊళ్ళో నెలరోజులున్నా ఒక్కసారి బాబాయ్‌గారింటికి వెళ్ళడానికి సాహసించలేదు. ఆయన ఎదురుపడినా ఆయనను తప్పించుకుని వెళ్లిపోతుండేవాడు.

గణపతి బస్సు దిగి రిక్షాలో ఇంటికి చేరుకునేసరికి అతడి శ్రీమతి ఆదుర్దాగా బయటకొచ్చింది.

''ఏమండోయ్ కొంపలంటుకున్నాయి. ఎవరో మీ వేలువిడిచిన మేనమామగారి మూడో అల్లుడి వియ్యంకుడికి దూరపు బంధువట. ఏదో ఆఫీసు పనిమీద వచ్చాడు. నెలరోజులు మనింట్లోనే వుంటాడట'' అంది మెల్లగా. ఆ మాటలకు వెంటనే గది లోపలవున్న అతిధిని చూసాడు గణపతి. తనకు ఫోటోస్టాట్‌లా కనిపించాడు. తనలాగే భారీ సూట్‌కేసు, బెడ్డింగ్‌తో వున్నాడు. క్షణంసేపు ఆలోచనలో పడి ''యురేకా'' అంటూ అరిచాడు గణపతి.

భర్త పాలికేకలోని 'పరమార్థం' పాలుపోక గణపతి శ్రీమతి తెల్లబోయి చూసింది.

★